సాక్షి
రంగారెడ్డి
గురువారం, 3, ఆగస్టు, 2023



భాగస్వాములు కండి

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. 8లో▸



మహిళల అభ్యున్నతితోనే..

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం ప్రగతి బాటలో పయనిస్తుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. 8లో▸



'డిప్యూటేషన్ల' ప్రభావం

వివిధ కారణాలతో మండలం నుంచి 9మంది ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లనున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

తుర్కయంజాల్: నులిపురుగుల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా గురువారం అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుర్తించిన 8,66,000 మంది పిల్లలకు 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. జ్వరం, కళ్ల కలక, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు ఈ నెల 10వ తేదీ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకే 'తొలిమెట్టు'

డీఈఓ సుశీంధర్‌రావు



డీఈఓ సుశీంధర్ రావుతో ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

కేశంపేట: విద్యా ప్రమాణాల మెరుగు కోసం తొలిమెట్టు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఈఓ సుశీంధర్‌రావు అన్నారు. మండలంలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు శిక్షణ పొంది రిసోర్స్ పర్సన్లుగా ఎంపికయ్యారని తెలిపారు. వీరు ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మూస పద్ధతిన పాఠ్యాంశాలు బోధించరాదని సూచించారు. కొత్త విధానం రూపొందించుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ సురేష్‌రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, కేశంపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రసూల్, మండల రిసోర్స్ పర్సన్లు ప్రకాష్, అరుణ, రాఘవేందర్, మాలతి, సత్తయ్య, గీతాజోషి తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైలును ఇబ్రహీంపట్నం వరకు పొడిగించాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మెట్రోరైలును ఇబ్రహీంపట్నం వరకు పొడిగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. మెట్రోరైలు పొడిగింపు మంచిదేనన్నారు. కానీ బొంగ్లూర్ వరకే కాకుండా ఇబ్రహీంపట్నం వరకు కొనసాగించాలని కోరారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయని, వేలాది మంది విద్యార్థులు వచ్చి పోతుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగర్ రహదారి రద్దీగా మారడంతో సమయానికి కళాశాలకు చేరుకోలేకపోతున్నారని, మెట్రోరైలు వస్తే ఈ సమస్య ఉండదన్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని ఆయన సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



జీపీ కార్మికుల సమ్మెలో కూర్చున్న నర్సింహారెడ్డి తదితరులు

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను బుధవారం ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు 010 పద్దు కింద జీతాలను చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతోపాటు పనికి తగిన వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికులకు పని గంటలకు కేటాయించాలన్నారు. కార్మికులు మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు, నాయకులు రాంచంద్రయ్య, రవి, పద్మ, పారేష, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ 674



ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ హరీష్

గ్రేటర్ జిల్లాల్లో వైన్‌షాపులు ఇలా..		
ఎక్సైజ్ జిల్లా	2019-21	2023-25
హైదరాబాద్	79	80
సికింద్రాబాద్	94	99
మల్కాజ్‌గిరి	82	88
మేడ్చల్	99	114
సరూర్‌నగర్	114	134
శంషాబాద్	81	100
వికారాబాద్	46	59
మొత్తం	595	674

- గడువుకు ముందే మద్యం షాపులకు నోటిఫికేషన్
- డిసెంబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న కొత్త లైసెన్సులు

సాక్షి, రంగారెడ్డి: ప్రభుత్వ నిర్ణయంతో గడువుకు ముందే కొత్త మద్యం షాపులకు లైసెన్స్‌ల జారీ ప్రక్రియ మొదలైంది. ప్రస్తుతం కొనసాగుతున్న వైన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాలి. కానీ తాజాగా మద్యం షాపుల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేయనున్నారు. ఈ మేరకు బుధవారమే లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను అధికారులు నిర్ధారించారు. వీటికి ప్రభుత్వం ఈ నెల 25న(నాలుగో శుక్రవారం) నోటిఫికేషన్ జారీ చేయనుంది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.2 లక్షలుగా నిర్ణయించింది. తుది గడువు ఆగస్టు 18గా పేర్కొంది. ఈ నెల 21న డ్రా ద్వారా దరఖాస్తు దారులకు షాపులను కేటాయించి, 30న ఆయా దుకాణాలకు కొత్త సరుకు అందజేయనుంది. ఇందులో భాగంగా కలెక్టర్ హరీష్ బుధవారం తన కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రక్రియకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

రిజర్వేషన్లు సామాజికవర్గం	షాపులు
గౌడ	74
ఎస్సీ	49
ఎస్టీ	8
ఓపెన్	543

రూ.130 కోట్లకుపైగా..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం ఏడు(హైదరాబాద్, సికింద్రాబాద్, సరూర్‌నగర్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్)ఎక్సైజ్ జిల్లాలు ఉన్నాయి. ఇందులో 674 షాపులు ఉండగా, రిజర్వేషన్ ప్రకారం గౌడ కులస్తులకు 15 శాతం చొప్పున మొత్తం 74 షాపులు, ఎస్సీలకు 10 శాతం చొప్పున మొత్తం 49 షాపులు, ఎస్టీలకు ఐదు శాతం చొప్పున 8 షాపులు కేటాయించింది. మిగిలిన 543 షాపులను ఓపెన్ కేటగిరి కింద నమోదు చేసింది. 2019-21లో దరఖాస్తుల ద్వారానే రూ.130 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో దరఖా స్తులు అందే అవకాశం లేకపోలేదు. అంతేకాదు లైసెన్సులు పొందిన వారు ఒక్కో షాపునకు అడ్వాన్స్‌గా ప్రభుత్వానికి రూ. 20 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సర్వత్రా అభ్యంతరాలు

ప్రభుత్వ నిర్ణయంపై మద్యం వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్ గడువు ముగియక ముందే మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా లైసెన్స్ తుది గడువుకు వారం పది రోజుల ముందు నోటిఫికేషన్ జారీ చేస్తుంటారు. ఈసారి అలా చేయకపోవడంతో లైసెన్సు కోసం వ్యాపారులు మూడు నెలల ముందే ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.లక్షలు చెల్లించాల్సి వస్తుంది. 2023 డిసెంబర్ తర్వాత కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని ముందుగానే రాబట్టకోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు.



మహేశ్వరంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

దళిత పక్షపాతి కేసీఆర్

- మంత్రి సబితారెడ్డి
- మహేశ్వరంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మహేశ్వరం: దళితుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరంలోని దళితవాడలో రూ.25 లక్షల నిధులతో అంబేడ్కర్ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దళితులంతా ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మహేశ్వరంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేస్తామన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా మార్చామని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో రూ. 35.75లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. పేదలకు కార్పొరేటు స్థాయి విద్యను అందించడమే లక్ష్యమని మంత్రి అన్నారు. మహేశ్వరంలో రూ.20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, సర్పంచ్ ప్రియాంక, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, డైరెక్టర్ కే చంద్రయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, ఎంఈఓ కృష్ణ, ఎంపీడీఓ నర్సింహ, తహసీల్దార్ మహమూద్ అలీ, డీఈ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలతో చర్చిస్తున్న ఆర్డీఓ

ఎన్నికలకు సహకరించాలి

- ఆర్డీఓ అనంత్‌రెడ్డి
- పలు పార్టీల నేతలతో సమావేశం

తుర్కయంజాల్: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ కే అనంత్‌రెడ్డి కోరారు. బుధవారం రాగన్నగూడ ఆర్డీఓ కార్యాలయంలో ఆయన పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అదనంగా మరో 17 ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలను కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బీ ప్రతాప్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీ రమేష్, సీపీఎం జిల్లా నాయకుడు పీ యాదయ్య, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వీ బాబు తదితరులు పాల్గొన్నారు.

'విలీన' సెగ

- చేవెళ్ల మున్సిపాలిటీలో మా గ్రామాలను కలపొద్దంటూ ఆందోళన
- జీపీలుగానే కొనసాగించాలని విన్నపం
- కాదని నిర్ణయం తీసుకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిక



చేవెళ్ల మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ చేస్తున్న పలు గ్రామాల ప్రజలు, నాయకులు

చేవెళ్ల: మున్సిపాలిటీలో మా గ్రామాలను విలీనం చేయడం తగదంటూ పలు గ్రామాల ప్రజలు బుధవారం నిరసన ర్యాలీ, ధర్నా చేపట్టారు. మండలంలోని దేవునిఎర్రవల్లి, దామరగిద్ద, పామెన, కేసారం ,ఇబ్రహీంపల్లి, ఊరేళ్ల, పలుగుట్ట, కందవాడ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో చేవెళ్లకు చేరుకొని ఆందోళన చేశారు. మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీలే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. సర్పంచులు బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ఎంపీడీఓ హిమబిందుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. అధికార వికేంద్రీకరణ చేయాలని కొత్తగా జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఉన్న జీపీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీగా చేస్తే మాకెలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ మా గ్రామాలను విలీనం చేసి తమ గ్రామాల ఉనికిని పోగొట్టుకోవడం ఇష్టం లేదన్నారు. మున్సిపాలిటీలో కలిస్తే ఇక్కడి ప్రజలు ఉపాధి కోల్పోతారని, ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విలీన గ్రామాలు చేవెళ్లకు సమీపంలో లేకపోవడం వల్ల అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోతాయని వాపోయారు. పెరిగే ఇంటి పన్నులు కూడా కట్టలేమని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఇష్టం లేని మున్సిపాలిటీ ఎందుకని, ఎవరి కోసం చేస్తున్నారని ప్రశ్నించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. కాదని నిర్ణయం తీసుకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా, పామేన మాజీ సర్పంచ్ డీ గోపాల్‌రెడ్డి, ఇబ్రహీంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, దేవునిఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, పామేన సొసైటీ డైరెక్టర్ రాములు, ఆయా గ్రామాల ప్రజలు,యువకులు,రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- లేదంటే బీజేపీకి రాజకీయ సమాధి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- మహేశ్వరంలో విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సు

మహేశ్వరం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించకపోతే బీజేపీకి రాజకీయ సమాధి కడుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్‌లో బుధవారం 'విశ్వరూప మహాసభ' సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ ఇచ్చిన హామీకి తొమ్మిదేళ్లు దాటిందని మండిపడ్డారు. రెండోసారి అధికారంలో వచ్చిన తర్వాత కూడా ఈ విషయాన్నే ప్రస్తావించడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కారణంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్గీకరణ బిల్లుకు విపక్షాల మద్దతు ఉన్నప్పటికీ తాత్సారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. 30 ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆగస్టు మూడో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభతో వీరందరి కళ్లు తెరిపిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమానికి ఇళ్లకు తాళం వేసి రావాలని మాదిగలకు పిలుపునిచ్చారు.

భారీ ర్యాలీ..

ఉదయం 11 గంటలకే మందకృష్ణ సమావేశం ఉండగా.. సాయంత్ర 6 గంటలకు వచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మహేశ్వరం గేటు నుంచి సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పలు మండలాలకు చెందిన మాదిగ ప్రజాప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్, ఎంఎస్పీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ రావుగళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ, జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ, జిల్లా ఇన్‌చార్జ్ మద్దిలేటి, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ తోకల చీరంజీవి, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకుడు పుల్లెల సుధాకర్, మహేశ్వరం ఎమ్మార్పీఎస్ నాయకులు వత్తుల రఘుపతి, బక్కని రవి, కృష్ణ, సురేష్, నవీన్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గితో బుగ్గి

- దుస్తుల దుకాణాలు, రెస్టారెంట్‌లో చెలరేగిన మంటలు
- హబ్సిగూడ, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో అగ్ని ప్రమాదాలు
- షార్ట్ సర్క్యూటే కారణమన్న ఫైర్ సిబ్బంది
- దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



లాలాపేట/హబ్సిగూడ/మైలార్‌దేవ్‌పల్లి: నగరంలో బుధవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చేసుకున్నాయి. హబ్సిగూడలోని దుస్తుల దుకాణం, రెస్టారెంట్‌లో, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దుస్తుల గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి ప్రమాదాన్ని నివారించారు. పోలీసుల కథనం ప్రకారం.. హబ్సిగూడ ప్రధాన రహదారిలోని 4 అంతస్తుల భవనంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రెండతస్తుల్లో అన్ లిమిటెడ్ దుస్తుల దుకాణం కాగా ఆపైన అంతస్తుల్లో టేస్ట్ ఆఫ్ ఇండియా రెస్టారెంట్ ఉన్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భవనం పైనుంచి భారీగా మంటలు వ్యాపించి రెండు అంతస్తులు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో మరింత ప్రమాదం జరగవచ్చని స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది సహకారంతో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. మౌలాలీ ఫైర్ స్టేషన్‌తో పాటు మల్కాజిగిరి, చర్లపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోని ఫైర్ సిబ్బంది 60 మంది నాలుగు ఫైర్ ఇంజిన్లతో దాదాపు 5 గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.అగ్ని ప్రమాదం కారణంగా ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ ప్రధాన రహదారి రెండు వైపులా వాహనాలు సుమారు 3 కి.మీ మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

పాత దుస్తుల గోదాంలో..

మైలార్‌దేవ్‌పల్లి అత్తాపూర్ పరిధిలోని పాత దుస్తులు విక్రయ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, రాజేంద్రనగర్ అగ్నిమాపక ఆఫీసర్ చంద్ర, కానిస్టేబుల్ కుమర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... కొంత కాలంగా మమ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఇబ్రహీం హసన్‌నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పెద్ద ఎత్తున పాత దుస్తులను సేకరించి గోదాముగా ఏర్పాటు చేసుకున్నారు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న ఇస్మాయిల్, ఇబ్రహీంలు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మహిళల అభ్యున్నతితోనే దేశ ప్రగతి


జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డిని సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్ రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం ప్రగతి బాటలో పయనిస్తుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం నగేష్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య 20వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రగతి నివేదికను సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి హాజరై మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అందజేస్తున్న బ్యాంక్ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఎవరిపై ఆధార పడకుండా బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వశక్తితో ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందుకొని స్వతహాగా ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు తాము ఎంచుకున్న ఉపాధి రంగంలో రాణించి మగవారితో సమానంగా సంపాదించాలని అన్నారు. అనంతరం డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు ఫైనాన్స్ మేనేజర్ నిర్మల మాట్లాడుతూ.. మండల మహిళా సమాఖ్య అన్ని విభాగాల్లో అగ్ర స్థానంలో నిలబెట్టేందుకు సభ్యులు కృషి చేయాలని అన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాంలో చెల్లించి మండల సమాఖ్యను జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డిని మహిళా సంఘాలు సభ్యులు సన్మానించారు. సమావేశంలో ఏపీజీవీబీ బ్యాంక్ అడ్వాన్స్‌డ్ మేనేజర్ లక్ష్మి, సీసీలు వెంకటయ్య, విజయ, కృష్ణయ్య, అమృతమ్మ, శివకుమార్, విగ్నేశ్వరి, ప్రభావతి, అలివేలు, మంగమ్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- రూ. 2.70 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం


గోవిందాయిపల్లిలో జీపీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని, అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గోవిందాయిపల్లిలో రూ. 20లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, రూ.10 లక్షలతో మైసిగండి – గోవిందాయిపల్లి మట్టి రోడ్డు పనులకు, రూ. 5లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఏక్వాయిపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, రూ.10 లక్షలతో గౌడ, గొర్రె కాపరుల సంఘం భవనాలకు, రూ. కోటితో ఏక్వాయిపల్లి – ముద్విన్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే రూ. 5లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. మక్తిపల్లిలో రూ. కోటితో చేపట్టిన మక్తిపల్లి – ఏక్వాయిపల్లి బీటీ రోడ్డు పనులకు, రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 83 గ్రామాల్లో రూ. 16.60 కోట్లతో నూతన జీపీ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామాలు, తండాల్లో రూ. 500కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే విధంగా అభివృద్ధి పనులకు ఎస్‌డీఎఫ్ క్రింద రూ.100 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. నియోజకవర్గంలో బీసీ బంధు పథకం క్రింద 300 మందిని ఎంపిక చేయడం జరిగిందని, వారికి రూ. లక్ష చొప్పున త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. దళితబంధు పథకం క్రింద నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు, యువకులకు మైనార్టీ బంధు క్రింద రూ.లక్ష అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, సర్పంచ్‌లు రవీందర్, భాగ్యలక్ష్మీ, సుగుణ, లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, ఎల్లాగౌడ్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, నిర్మలాదేవి, ఉమావతి, ఉపసర్పంచ్‌లు ఎల్లాగౌడ్, ముత్యాలు, నర్సింహ, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, డీఈ తిరుపతిరెడ్డి, ఏఈలు పరమేష్, శ్రావ్య, ఎంపీవో మధుసూదనాచారి, మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు సోమయ్య, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్


పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కమిషనర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని కాలనీలు, వెంచర్లలో ప్రజా ప్రయోజనార్థం వదిలిన ఖాళీ స్థలాలు, పార్కుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం కమ్మగూడ 22వ వార్డులో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్యతో కలిసి నవభారత్ కాలనీలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఇదే కాలనీలో రూ. 18లక్షల వ్యయంతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బొలెరో

డ్రైవర్ మృతి, మరొ వ్యక్తికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆగిఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీ కొనడంతో డ్రైవర్ దుర్మరణం చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రఘువీర్‌రెడ్డి కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా, బూత్‌పూర్ మండలం, యెల్కిచర్ల గ్రామానికి చెందిన డ్రైవర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి బొలెరో వాహనంలో మహబూబ్‌నగర్ నుంచి ఆటోనగర్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం బొంగ్లూర్ వద్ద ఆగిన ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా పక్కనే ఉన్న వంశీధర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తుర్కయంజాల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్‌రెడ్డి(34) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రోడ్డు పక్క టిప్పర్‌ను ఆపిన డ్రైవర్ అంకం బాల్‌రాజ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పైపుల మధ్య నలిగి కార్మికుడి మృతి

ఆనంద్ మెటాలిక్ పరిశ్రమలో ఘటన

కొత్తూరు: రెండు పైపుల మధ్యలో నలిగి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొడిచర్ల తండా శివారులో గల ఆనంద్ మెటాలిక్ పరిశ్రమలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సరోజ్‌యాదవ్(36) కొన్ని నెలలుగా పరిశ్రమలో ఫ్యాబ్రికేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా పనిచేస్తుండగా రెండు పైపుల మధ్యలో పడడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి సోదరుడు హరిందర్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మణిపూర్ ఘటనపై నిరసన

శంషాబాద్: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ శంషాబాద్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ గ్లోరీ బాబు, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఏలియాబాబు ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో ప్రార్థనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ శాసన మండలి సభ్యులు సి.హెచ్.రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశా రు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ మండలం పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మణిపూర్ ప్రజలను కాపాడాలని శాసన మండలి సభ్యులు సి.హెచ్.రాజేశ్వర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల నుంచి వచ్చిన దైవ సేవకులు రెవరెండ్ డాక్టర్ జి.విజయభూషణం, రెవరెండ్ జోసెఫ్ అంజన్న, రెవరెండ్ కె.సుందర్‌పాల్, రెవరెండ్ స్వర్ణకుమార్, జి.జె.ప్రకాష్, రెవరెండ్ ఎం.ఎం.సామ్యూల్, రెవరెండ్ ఎ.మనోహరం పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

శంకర్‌పల్లి: దంపతులు గొడవ పడడంతో మనస్తాపానికి గురైన భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పర్వేద గ్రామానికి చెందిన లింగమ్మ(55), అనంతయ్య దంపతులు. ఉదయం వీరు పొలానికి వెళ్లారు. అక్కడ వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన లింగమ్మ ఇంటికి వచ్చి ఉరేసుకొని చనిపోయింది. మృతురాలి భర్త అనంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శంషాబాద్ రూరల్: మండలంలోని రషీద్‌గూడ పంచాయతీ అనుబంధ గ్రామం పోశెట్టిగూడలో బుధవారం సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ రాణి భూమి పూజ చేశారు. రూ. 12.50 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్లారెడ్డి, జగన్, ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ మోహన్ రావు, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మమ్మ, మాజీ వార్డు సభ్యుడు బి.ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు రవి, ఈశ్వర్, కుమార్, రాములు, జనార్ధన్, సత్యనారాయణ, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోని ప్రభుత్వాలు

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్


ఇళ్లు కూలిపోయిన వారికి సరుకులు అందజేస్తున్న వీర్లపల్లి శంకర్

కేశంపేట: అకాల వర్షాలకు ఇళ్లు, పంటలు కోల్పోయిన బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మండలంలోని వేములనర్వ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయిన వారికి బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేదలకు ఇళ్లు మంజూరు చేయాలేదన్నారు. చాలా మంది పేదలు సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో బోధునంపల్లి గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఆయా కార్యక్రమాల్లో జగదీశ్వర్, యాదయ్య యాదవ్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మనోహర్ గౌడ్, అశోక్, జంగయ్య, నర్సింహ, రావుల పెంటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రవి మృతదేహం

మొయినాబాద్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరు రాజీవ్ గృహకల్ప క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లికి చెందిన ప్రభాకర్(31) భార్య, పిల్లలతో బతుకుదెరువు కోసం ఆరు సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్‌కు వలస వచ్చాడు. డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల క్రితం మొయినాబాద్ మండలం చిలుకూరు రాజీవ్ గృహకల్ప క్వార్టర్స్ రెండో అంతస్తులో ఫ్లాట్ కొనుగోలు చేసి ఇక్కడే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి కిటికీలో ఆరేసిన బట్టలు మొదటి అంతస్తు కిటికీ సజ్జపై పడటంతో వాటిని ఇనుప వైరుతో తీయడానికి ప్రయత్నిస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేదలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తాం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


జిల్లేడ్‌లో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర, చౌదరిగూడలలో రైతు వేదికలను ప్రారంభించారు. జిల్లేడ్, ముష్టిపల్లి గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాకుల శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయంతోపాటు సరుకులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఆదరించి మరోసారి గెలిపించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లేడ్ చౌదరిగూడ మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం రామస్వామి మండల మహిళా సమాఖ్య వార్షిక ప్రగతి నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేశ్, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీఓ మహేశ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బోధనపై 'డిప్యూటేషన్ల' ప్రభావం

- మండలం నుంచి 9మంది ఉపాధ్యాయులకు డిప్యూటేషన్లు
- కుంటుపడనున్న విద్యావ్యవస్థ
- రద్దు చేయాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు


కేశంపేట ఎంఈఓ కార్యాలయం

కేశంపేట: అవసరం ఉండి ఒక్కరు, అనారోగ్య రీత్యా ఇంకొక్కరు, పైరవీలతో మరి కొందరు.. ఇలా మండలం నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ఆర్డర్లు తెచ్చుకున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో విధులు నిర్వహించే సీనియర్ ఉపాధ్యాయులను పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. తర్వాత జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని హైదరాబాద్ నుంచి మండలానికి రాకపోకలు సాగించే ఉపాధ్యాయులు పైరవీలు చేసుకొని నగరంలోనే విధులు నిర్వహించేందుకు ఆర్డర్లు తెచ్చుకున్నట్లు తెలిసింది. ఒకే సారి 9మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ఆర్డర్లు తెచ్చుకోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 330 మంది విద్యార్థులు, 16మంది ఉపాధ్యాయులు ఉండగా నలుగురికి డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ఉత్తర్వులు వచ్చాయి. కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా ఉన్న మనోహర్‌కు కందుకూరు ఇన్‌చార్జ్ ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. ఇదే పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా ఉన్న శ్రీనివాసరావుకు జిల్లా సైన్స్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన జిల్లా కేంద్రంలో ఉండాల్సి వస్తోంది. ఇదే పాఠశాలకు చెందిన మరో ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ఉత్తర్వులు అందాయి. నిర్దవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ హిందీ టీచర్‌ను హైదరాబాద్‌లోని జిల్లెలగూడ పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు. దీంతో ఈ పాఠశాలలో హిందీ బోధన చేసేవారు లేకుండా పోయారు. పాపిరెడ్డిగూడ జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ఒకరు, కొత్తపేట ప్రాథమిక పాఠశాల నుంచి మరొకరు, తొమ్మిదిరేకుల ప్రాథమిక పాఠశాల నుంచి ఇంకో ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లనున్నారు. ఇదిలా ఉండగా పాఠశాలలో సబ్జెక్టు టీచరుకు డిప్యూటేషన్ ఇస్తే బోధన ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటేషన్ ఆర్డర్లను మరోసారి పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి



కేశంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 330మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ వేశారు. వీరు ఇతర పాఠశాలలకు వెళితే సంబంధిత సబ్జెక్టు బోధించే వారు ఉండరు. దీంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందులు ఎదురవుతాయి. పాఠశాల నుంచి ఒక్క ఉపాధ్యాయుడు కూడా వెళ్లకుండా జిల్లా అధికారులపై ఒత్తిడి తెస్తాం.

– వెంకట్‌రెడ్డి, సర్పంచ్, కేశంపేట